క్లుప్తంగా

ఘనంగా డ్యాన్స్ అసోసియేషన్ వార్షికోత్సవం


నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా డ్యాన్స్ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళా క్షేత్రంలో ఘనంగా జరిగింది. కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. శాస్త్రీయ, పాశ్చాత్య నృత్య ప్రదర్శనకు మొదటి సారి జిల్లాలో సంఘం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాట్య గురువులును అతిథులు సన్మానించారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, సభ్యులు రాఘవేంద్ర, షాకీర్, అఫ్జల్, మధుబాబు, రోహిత్ సాయి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. లక్ష్మీ నరసింహుని ప్రభోత్సవం


స్వామివారి ప్రభోత్సవంలో భక్తులు


కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో శ్రీనవరత్నాల లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి ప్రభోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై ఆశీనులను చేసి పుర వీధుల్లో ఊరేగించారు.

జోరందుకున్న వ్యవసాయ పనులు


కల్లపరిలో ఎద్దులతో దుక్కులు చేస్తున్న రైతు

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వారం నుంచి మండలంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో పత్తి, కొర్ర, కంది, వేరుశనగ పంటలను సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఎక్కడ చూసినా పంటల సాగు కోసం రైతులు దుక్కులు చేస్తున్నారు. పొలాలను దున్నడం, చదును చేయడం, ఎరువులు చల్లడం, పొలాల్లో ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను ఏరివేసి పంట సాగుకు అనువుగా భూములను సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు విడుదల చేసిన పంట నష్టపరిహారం డబ్బులు కూడా రెండు రోజుల నుంచి రైతుల ఖాతాల్లో జమవుతుండడంతో రైతులు మరింత ఉత్సాహంగా పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

డిసెంబర్‌లో జేవీవీ మహాసభలు


మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

కర్నూలు కల్చరల్: జన విజ్ఞాన వేదిక మహాసభలను డిసెంబర్‌లో నిర్వహించనున్నట్లు అధ్యక్షులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి తెలిపారు. కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల జేవీవీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం ఆదివారం కర్నూలు ఆర్ట్ ఫౌండేషన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భసంచి, ఫైల్స్, కుటుంబ నియంత్రణ, హెర్నియ లాంటి ఆపరేషన్లు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్ల ద్వారా చేయించొచ్చని వివరించారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు బి.సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ మియ్యా, ప్రతాపరెడ్డి, రమణయ్య, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య వెల్లడించారు. ఆయన ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతూ.. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. తెలంగాణ రాష్ట్రం, అయిజ మండలం, సింధనూరు గ్రామానికి చెందిన మహమ్మద్, చాకలి నాగరాజు కర్ణాటక మద్యాన్ని బైక్‌పై తరలిస్తుండగా బ్రిడ్జి వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. కర్ణాటక మద్యం 480 జాన్స్ ఒరిజినల్ చాయస్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. తనిఖీలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

‘ప్లానింగ్’లో చేతివాటం

- కమిషనర్ ఇచ్చిన అప్రూవల్స్ బేఖాతర్ చేస్తున్న బిల్డర్లు
- నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు, వాణిజ్య నిర్మాణాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- అదనపు ఫ్లోర్లు, అనుమతి లేని నిర్మాణాలకు రూ.లక్షల్లో మామూళ్లు

కర్నూలు (టౌన్) : నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అక్రమ కట్టడాల విషయంలో ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కమిషనర్ ఇచ్చిన అప్రూవల్స్‌కి విరుద్ధంగా, నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. బిల్డింగ్ అనుమతులు, నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి నగరపాలక సంస్థకు ఆదాయం చేకూర్చాల్సిన అధికారులు, సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తూ రూ. 2 లక్షల నుంచి రూ.5 లక్షలు వసులూ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అక్రమ నిర్మాణాల్లో కొన్ని..

➤ నగరంలోని కేవీఆర్ గార్డెన్‌లో రెసిడెన్షియల్ భవనం నిర్మిస్తున్నారు. 11.75 మీటర్ల ఎత్తు ఉన్న ఈ బిల్డింగ్‌కు పర్మిషన్ ఉంది. కమిషనర్ అనుమతులు ఇచ్చారు. అప్రూవల్‌లో పక్కాగా కనిపిస్తున్నాయి. అయితే నిర్మాణాల్లో మాత్రం నిబంధనలు బేఖాతర్ చేశారు. ప్లాన్‌లో సెల్లార్ చూపించారు. వాస్తవానికి నిర్మాణాల్లో సెల్లార్ లేదు. అలాగే సెట్ బాక్స్ 5 అడుగుల చొప్పున చూపించినా .. వాస్తవంలో వదల్లేదు. ఇక అనుమతి లేకుండా అదనపు ఫ్లోర్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇచ్చిన అనుమతి ప్రకారం నిర్మాణం చేపట్టారా.. నిబంధనలు అతిక్రమించారా.. అన్నది విజిలెన్స్ అధికారులు రికార్డులు, వాస్తవ నిర్మాణాన్ని పరిశీలిస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయి.

➤ నరసింగ రావు పేటలో ఓ వాణిజ్య భవనం ఇటీవలే పూర్తి చేశారు. కమిషనర్ ప్లాన్ అప్రూవల్ ఇచ్చారు. ప్లాన్‌లో వెనుక వైపు పార్కింగ్ స్థలం చూపించాడు. అయితే.. నిర్మాణాల్లో లేదు. ఇలా ఏన్నో అక్రమాలు ఉన్నాయి.

➤ పాతబస్టాండ్ అజంతా హోటల్ లైన్‌లో 6 ఫ్లోర్లలో కమర్షియల్ భవనం నిర్మించారు. ఎలాంటి సెట్ బ్యాక్స్ లేవు. పైగా పార్కింగ్ సౌకర్యం లేదు.

➤ మద్దూరు నగర్‌లో మెయిన్ రోడ్డులో ఓ వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారు. నాలుగు ఫ్లోర్లలో నిర్మిస్తున్నా.. ఈ నిర్మాణానికి ఎలాంటి సెట్‌బ్యాక్‌లు వదల్లేదు. మూడు వైపులా స్థలం వదలాలి. ఇక అదనంగా ఫ్లోర్లు కడుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇక కృష్ణానగర్‌లో సెల్లార్ లేకుండా 5 ఫ్లోర్లలో నిర్మాణం చేపడుతున్నారు. అలాగే అదే రహదారిలోనే అదనంగా అనుమతులు లేకుండా ఫ్లోర్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

➤ స్థానిక వెంకటరమణ కాలనీలోని రాగమయూరి కమర్షియల్ పార్కు సమీపంలో 6 ఫ్లోర్లు నిర్మించారు. సరైన పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయలేదు. ఇన్ని ఫ్లోర్లలో ఉండే నివాసితులు వారి వాహనాలు, కార్లు ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలి..?

ఫిర్యాదులు చేస్తున్నా... పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు

నిత్యం టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య భవనాలకు సంబంధించి స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవేళ స్పందించినా.. హడావుడి చేసి పనులు నిలిపివేయడం.. సరిగ్గా నెల రోజులు దాటితే మళ్లీ అవే అక్రమాలు కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదు. పర్యవేక్షణ చేయాల్సిన ప్లానింగ్ కార్యదర్శులు, చైన్ మెన్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు సైతం తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ భవనాల అనుమతులు, చేపడుతున్న నిర్మాణాలను విజిలెన్స్ అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.


కేవీఆర్ గార్డెన్‌లో అనుమతి లేకుండా అదనపు ఫ్లోర్ నిర్మాణం


మద్దూరునగర్‌లో సెట్ బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్న నాలుగు ఫ్లోర్ల కమర్షియల్ భవనం

ఎన్నికల వేళ అక్రమాలకు తెరలేపారు

నగరపాలక ఉన్నతాధికారి రిటర్నింగ్ అధికారిగా పనిచేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దాదాపు రెండు నెలలుగా బిజీ బిజీగా ఉంటున్నారు. అంతే.. సందట్లో సడేమియా అన్న చందంగా టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందికి రెండు చేతులా అక్రమ ఆదాయానికి తెర లేపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేశారు. అక్రమంగా కట్టడాలు కడుతున్నా పట్టించుకోవడంలేదు. పైగా స్ట్రక్చరల్ ఇంజినీర్, ప్లానింగ్ కార్యదర్శుల సంపూర్ణ సహకారం ఉండటంతో టౌన్ ప్లానింగ్ అవినీతి అక్రమాలను అడ్డు అదుపు లేకుండా పోయింది. అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ చేయాల్సిన ప్లానింగ్ కార్యదర్శులు, చైన్ మెన్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదనపు ఫ్లోర్‌కు, అనుమతి లేని నిర్మాణాలకు రూ.2 లక్షలు డిమాండ్ చేస్తున్నారని సమాచారం . ఇస్తే.. పట్టించుకోరు.. ఇవ్వకుంటే నిబంధనలు పాటించాలంటూ యజమానులకు వేధింపులు తప్పడంలేదు.

అధికారులకు సమాచారం ఇచ్చా.. స్పందించలేదు



తమ వార్డులోనే కాకుండా రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారు. అనుమతులు తీసుకొని, ప్లానింగ్ పాటించడం లేదు. రెండు ఫ్లోర్లకు అనుమతి తీసుకొని నాలుగు ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. సెల్లార్ పార్కింగ్ లేదు. స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చా. అదిగో.. ఇదిగో అన్నారు. పట్టించుకోలేదు. మరోవైపు నిర్మాణం పూర్తి కావస్తోంది. ఫిర్యాదు చేసినా.. సంబంధిత అధికారులు కనీసం పట్టించుకొకపోవడంపై అనుమానాలు ఉన్నాయి. – క్రాంతికుమార్, 12 వ వార్డు కార్పొరేటర్

పేదలను ఆదుకుందాం

కర్నూలు (టౌన్) : సమాజంలోని పేదలను మన వంతు బాధ్యతగా ఆదుకుందామని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని శ్రీగురు పాలీ క్లినిక్‌లో పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సొంత లాభాన్ని కొంత మానుకొని సేవా దృక్పథంతో ముందుకు రావాలన్నారు.

21 నుంచి కోసిగయ్య స్వామి ఉత్సవాలు


ఊరేగింపునకు సిద్ధమవుతున్న రథం

కోసిగి: మండల ప్రజల ఆరాధ్య దైవం శ్రీ ఆంజనేయ స్వామి మహా రథోత్సవం ఈనెల 23వ తేదీన సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య రమణీయంగా సాగనుంది. ఈమేరకు దేవదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుంచి ఉత్సవాలకు అంకుర్పారణ పలకనున్నారు. 21న మంగళవారం ఆలయ ప్రాంగణంలో సీతారాముల వారికి నిశ్చియ తాంబులంతో పూజలు ప్రారంభించనున్నారు. 22న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీతారాముల కల్యాణోత్సవం వేదమంత్రోచ్ఛరణాలు, మేళతాళాలు మధ్య కమణీయంగా నిర్వహించనున్నారు. 23న మాఘశుద్ధ పౌర్ణమి రోజున సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని పల్లకీలో కొలుఉంచి ఆలయం నుంచి తేరుబజారు మైదానం వరకు ఊరేగిస్తారు.

హెచ్‌ఐవీని నిర్మూలిద్దాం


క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం అధికారులు

కర్నూలు (టౌన్) : హెచ్‌ఐవీని నిర్మూలిద్దామని జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం జిల్లా మేనేజర్ అలీ హైదర్ పిలుపునిచ్చారు. 41వ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినం సందర్భంగా ఆదివారం రాత్రి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీతో చనిపోయిన వారిని మనం గుర్తు చేసుకుంటూ.. వారి కుటుంబాల్లో ధైర్యాన్ని నింపేందుకు ర్యాలీ చేపడుతున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో 12,030 మంది క్రమం తప్పకుండా 4 ఏఆర్‌టీ కేంద్రాలు, 9 లింకు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా మందులు వాడుతున్నారన్నారు. లెప్రసీ, క్షయ విభాగం వైద్యులు మల్లికార్జున రెడ్డి, డాక్టర్ రాధిక పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి


భక్తులకు సందేశమిస్తున్న రఘునందన సేవక్ దాస్

కర్నూలు కల్చరల్: చిన్నతనం నుంచి విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ దాస్ అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ప్రభుపాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు, భక్త ప్రహ్లాద బడి విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. పురాణ ఇతిహాసాలు, రామాయణం, మహాభారతాల గురించి వివరించాలన్నారు. భక్త ప్రహ్లాద బడి విద్యార్థులు ప్రదర్శించిన నృసింహ నాటకం, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దాం


సుందరయ్య భవన్‌లో సుందరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్): పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం నాయకులు ప్రతినబూనారు. ఆదివారం సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకొని సీపీఎం కార్యాలయంలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ..ఉద్యమే ఊపిరిగా ప్రజా సేవకు అంకితమైన సుందరయ్య జీవితం దేశానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.రాముడు, ఎండీ అంజిబాబు, గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహారులు అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్‌లో, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ ఆటో స్టాండ్‌లో నివాళులర్పించారు. వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సీ.గురుశేఖర్ అధ్యక్షతన, శరీన్‌నగర్‌లో ప్రసాదు శర్మ, జీఎన్ శేషయ్య ఆధ్వర్యంలో, కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో కె.సుధాకరప్ప, ఎంగోపాల్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

సుందరయ్య జీవితం ఆదర్శనీయం

కర్నూలు(సెంట్రల్) : పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. ఆదివారం సుర్జీత్‌భవన్‌లో సుందరయ్య 39వ వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

రాయలసీమ ఆణిముత్యం నీలం సంజీవరెడ్డి


సంజీవరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ రాజకీయ ఆణిముత్యం నీలం సంజీవరెడ్డి అని, ఆయన ముఖ్యమంత్రిగా, రాష్ట్రపతిగా అందించిన సేవలు అభినందనీయమని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. ఆదివారం నీలం సంజీవరెడ్డి 111వ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతమైన అనంతపురంలో జన్మించిన నీలం సంజీవరెడ్డి భారత ఆరో రాష్ట్రపతిగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ఏఐసీసీ అధ్యక్షుడిగా, లోక్‌సభ స్పీకర్‌గా సేవలందించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మాజీ మంత్రి మూలింటి మారెప్ప, పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.

‘రీటా నేర్చిన పాఠం’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం సీనియర్ నాయకురాలు బృందాకారత్ కార్మిక రంగంలో పనిచేస్తూ తన అనుభవాలను ‘రీటా నేర్పి పాఠం’ పుస్తక రూపంలోకి తెచ్చారని, ఈపుస్తకాన్ని కార్మికులందరూ చదవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో రీటా నేర్చినపాఠం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో ఎమర్జెన్సీ సమయంలో ఎలా పనిచేయాలో బృందాకారత్ ఎంతో విపులంగా రాశారన్నారు. కార్మికులు ఐక్యంగా ఉద్యమాలు చేస్తే వచ్చే ఫలితాలను చక్కగా వివరించారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, విజయ్, గోపాల్, ప్రభాకర్, జయనాగేశ్వరరావు, బతుకన్న పాల్గొన్నారు.

నేటి నుంచి జీలుగలకు నమోదు

పాణ్యం: ఖరీఫ్ సాగుకు సంబదించి జీలుగలు కావాల్సి రైతులు ఆయా గ్రామాల ఆర్‌బీకేల్లో సోమవారం నుంచి నమోదు చేసుకోవాలని ఏఓ జయప్రకాష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎకరానికి ఒక ప్యాకెట్ చొప్పున అందిస్తున్నామన్నారు. రాయితీపోను రైతు వాటా రూ. 440 చెల్లించిన జీలుగలు పొందాలన్నారు. ముందంగా రైతులు ఆయా ఆర్‌బీకేలో పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డుతో నమోదు చేయించుకోవాలన్నారు.

550 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కోడుమూరు మండలానికి 550 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు ఈనెల 20వ తేదీ సోమవారం నుంచి ఆయా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నా పత్రాలు

సి.బెళగల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ప్రశ్నపత్రాలు ఆదివారం సి.బెళగల్‌కు చేరుకున్నాయి. ప్రశ్న పత్రాలను రూట్ అధికారి, సి.బెళగల్ ఎంఈఓ ఆదామ్‌బాషా, అదనపు రూట్ అధికారి, జొహరాపురం జెడ్పీస్కూల్ ఎస్‌ఏ రమణగౌడ్ స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేర్చారు. ప్రశ్న పత్రాలను కాస్టోడియన్, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ ఎస్‌ఏ మల్లయ్య, జాయింట్ కస్టోడియన్, ఎరుకలచెరువు జెడ్పీ హెచ్‌ఎం ఇనాందుల్లా తదితరులు పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. సి.బెళగల్‌లోని రెండు పరీక్ష కేంద్రాలకు సంబంధించి ప్రశ్న పేపర్లను స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బాలరాముడు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వంశీమోహన్, పరీక్షల నిర్వహణ అధికారులు అనంతయ్య వివరాలను నమోదు చేసుకున్నారు. కాగా సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూళ్లలో ఈనెల 24వ తేదీ నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

చదరంగంతో మేధాశక్తి


చెస్ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్) : చదరంగం పోటీల్లో పాల్గొంటే మేధా శక్తి పెరుగుతుందని బద్రి చెస్ అకాడమి కోచ్ కె.బద్రి అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని బుధవారపేటలో ఉన్న జిల్లాస్థాయి ఓపెన్ చదరంగం (చెస్) పోటీలను నిర్వహించారు. బాలుర విభాగంలో మొత్తం ఆరు రౌండ్లకు గాను ఐదున్నర రౌండ్లలో విజయం సాధించి ఎస్‌ఏల్‌ఎన్ ఉద్భవ్ మొదటి బహుమతి కైవసం చేసుకున్నాడు. అలాగే బాలికల విభాగంలో ఐదు రౌండ్లకు గాను ఐదు విజయం సాధించి కె.సమన్విత మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కోచ్ కె.బద్రి మాట్లాడుతూ బద్రి చెస్ అకాడమీ విద్యార్థులు విజయం సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అలాగే రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఇద్దరు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 25, 26 తేదీలలో హిందూపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా నుంచి విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

ముగిసిన బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

- బండలాగుడు విజేత ఎస్.కొత్తూరు వృషభాలు


బండనులాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: అమకతాడు గ్రామంలో నాలుగు రోజులుగా జరిగిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా న్యూ కేటగిరి విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్. కొత్తూరు గ్రామానికి చెందిన బీరం సుబ్రమణ్యంరెడ్డి వృషభాలు 5,250 అడుగులు లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం మాచానిపల్లె గ్రామానికి చెందిన సాకం బ్రహ్మానందారెడ్డి వృషభాలు 5,040 అడుగులు లాగాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం బొందలదిన్నె గ్రామం జంగం గురులోహిత్, ఇదే జిల్లా బుక్కారాయసముద్రం మండలం రేగడి కోత్తూరు గ్రామానికి చెందిన భూమిరెడ్డి గౌతంరెడ్డి వృషభాలు సంయుక్తంగా 4,750 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. జోగులాంబ గద్వాల జిల్లా చెర్లగార్లపాడు గ్రామానికి చెందిన రామాంజనేయులు, సీ.బెలగల్ మండలం, వినకండ్ల గ్రామానికి చెందిన వేణుగోపాల్ వృషభాలు సంయుక్తంగా 4,607 అడుగులు లాగి నాల్గో స్థానంలో నిలిచాయి. ఐదో స్థానంలో డోన్ మండలం కొచ్చేర్వు బజారి లక్ష్మీదేవమ్మ వృషభాలు 3,303 అడుగులు లాగినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాలకు దాతలు, సర్పంచ్ బోయ సర్వేశ్వరి వరుసగా రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలను అందజేశారు.

హోరాహోరీగా ఎద్దుల బండలాగుడు పోటీలు


బండలాగుతున్న ఎద్దులు


బహుమతులు ప్రదానం చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ఎద్దులు బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి వీరబ్రహ్మేంద్ర స్వాముల ఆరాధనోత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన పాలపళ్ల విభాగం ఎద్దుల పోటీలను మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తనయుడు శ్రీరెడ్డి భరత్‌రెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్ కడప జిల్లా, దాసేపల్లెకు చెందిన మొలకల చిన్న వీరన్నయాదవ్ వృషభాలు నిర్ణీత సమయానికి 6,168 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలువగా, దాతలు రూ.50 వేలను ప్రదానం చేశారు. అనంతపురం జిల్లా, పుల్లేటిపల్లె బచ్చల భాస్కర్‌రెడ్డి వృషభాలు 6,163 అడుగులులాగి రెండవ బహుమతి రూ.40 వేలను దక్కించుకున్నాయి. అలాగే వైఎస్సార్ జిల్లా, సి.కొత్తపల్లెకు చెందిన మామిళ్ల సుబ్బారెడ్డి వృసభాలు 6,075 అడుగులు లాగి మూడవ బహుమతి రూ.30 వేలను కైవసం చేసుకున్నాయి. అనంతపురం జిల్లా, కోసూరు మండలం, పల్నాడుకు చెందిన గోపిరెడ్డి వెంకటరెడ్డి వృషభాలు 6,000 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ.20 వేలను దక్కించుకోగా, సూర్యపేట జిల్లా, కోదాడ మండలం, రామలక్ష్మిపురం వాస్తవ్యులు కేఎస్ రెడ్డి, నంది ట్రేడింగ్ బుల్స్ 5,909 అడుగులు లాగి ఐదవ బహుమతి రూ.15 వేలు, కర్నూలు జిల్లా, బి.తాండ్రపాడు, పీఆర్‌పల్లెకు చెందిన చిన్నరత్నం, రంగనాయకులు(విడిజత) వృషభాలు ఆరవ బహుమతి రూ.10 వేలను కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలకు వాడాల రామనాయుడు, అబ్దుల్ కలాం వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సచివాలయ కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు మనోహరప్ప, ఎర్రన్న యాదవ్, రమేష్‌నాయుడు, కృష్ణయ్య యాదవ్, వడ్డె మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

వెల్దుర్తి(కృష్ణగిరి): సేంద్రియ వ్యవసాయం చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు సుధాకర్, అలీ బాషా, గంధర్వ ఆచారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు డ్రమ్ములు, తారు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని తొమ్మిది గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు తొమ్మిది రకాల విత్తనాలు అందజేశామని తెలిపారు. అలాగే 123 మంది సన్న, చిన్నకారు రైతులకు ఒక్కొక్కరికి రెండు డ్రమ్ములు, తారు పట్టాలను పంపిణీ చేశామని వెల్లడించారు. ఏడాదికేడాది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు వస్తున్నారని.. వారందరికీ ప్రోత్సాహం అందిస్తామన్నారు.

‘హిందూ సంఘటన’లో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న వీహెచ్‌పీ కేంద్రీయ సంఘటనా మంత్రి వినాయకరావు

కర్నూలు కల్చరల్: హిందూ సంఘటనలో భాషా బేధం లేకుండా అందరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని వీహెచ్‌పీ కేంద్రీయ సంఘటన మంత్రి వినాయరావు అన్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆదివారం ఓల్డ్‌సిటీలోని జైన్ మందిరంలో హిందీ భాషా మాట్లాడే వారితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత దేశం ఎన్నో భాషలు, కులాల సమ్మేళనమన్నారు. వీహెచ్‌పీ అన్ని భాషలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. విశ్వ హిందూ పరిషత్ 125 దేశాల్లో తన సేవలను అందిస్తుందన్నారు. జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ జిల్లాలో 12 డివిజన్లలో కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. దేవాలయాల ఆస్తుల రక్షణకు, హిందువులపై దాడులను అడ్డుకోడానికి వీహెచ్‌పీ సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర ధర్మ ప్రసార్ కన్వీనర్ ఏవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్, జిల్లా సహ కార్యదర్శులు గిరిబాబు, గోవిందరాజులు, నగర ఉపాధ్యక్షులు నాగరాజు, ప్రఖండ అధ్యక్షులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.